ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తమిళనాడు
TAMILNADU
గురువారం 5 సెప్టెంబరు 2024



ఈశాన్యం ముప్పుపై మంత్రివర్గ ఉపసంఘం

● ముందస్తు చర్యలకు అధికారులు, నేతలతో భేటీ



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఉదయనిధి

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వచ్చే నెల ఈశాన్య రుతుపవన సీజన్ (వర్షాకాలం) ప్రారంభం కానున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందస్తు చర్యల కోసం ముగ్గురు మంత్రులతో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. సీనియర్ మంత్రులు కేఎన్ నెహ్రూ, పీకే శేఖర్‌బాబు, ఉదయనిధితో ఈ ఉపసంఘం ఏర్పాటైంది. సాధారణంగా ఈ సీజన్‌లో విస్తారంగా వర్షాలు కురుస్తుంటాయి. దీంతో భారీ వరదలు సంభవించి అపారనష్టం వాటిల్లుతోంది. ఈ నేపథ్యంలో ఈ సీజన్‌లో ఎలాంటి నష్టం జరుగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన చర్యలపై ఈ మంత్రివర్గ ఉపసంఘం సూచనలు చేయనుంది. ఈ యేడాది కురిసే భారీ వర్షాల కారణంగా చెన్నై నగరంలో ఎలాంటి నష్టం కలగకుండా తీసుకోవాల్సిన చర్యలపై కీలక సమావేశం బుధవారం మంత్రివర్గ ఉపసంఘం నేతృత్వంలో జీసీసీ ప్రధాన కార్యాలయం రిప్పన్ భవనంలో జరిగింది. ఇందులో నగర మేయర్ ఆర్.ప్రియ, ఉప మేయర్ మహేష్, కార్పొరేషన్ కమిషనర్ కుమారగురుబరన్, ఎంపీలు దయానిధి మారన్, తమిళచ్చి తంగపాండ్యన్, డాక్టర్ కళానిధి వీరాస్వామి, ఎమ్మెల్యేలు ఆర్‌డీ శేఖర్, ఐడ్రీమ్ మూర్తి, పరంధామన్, కరుణానిధి, అరవింద్ రమేష్, ఐఏఎస్ అధికారులు కార్తికేయన్, సిద్ధిక్, ఆయా జోన్లకు చెందిన ఉన్నతాధికారులు, మెట్రోవాటర్, సీవరేజ్ బోర్డు, మెట్రో రైల్, జలవనరుల శాఖ, విపత్తుల నిర్వహణ, ఆరోగ్య, రెవెన్యూ, పోలీస్, అగ్నిమాపక శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వర్షాకాలంలో తమతమ ప్రాంతాల్లో ఉత్పన్నమయ్యే సమస్యలను ఎమ్మెల్యేలు ప్రస్తావించారు. వర్షాకాలంలో చెన్నై నగరంలో ఎక్కడా చుక్కనీరు నిల్వకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా మంత్రివర్గ ఉపసంఘం సూచించింది. అలాగే, నగరంలోని పలు ప్రాంతాల్లో కొనసాగుతున్న వర్షపునీరు, డ్రైనేజీ కాల్వల నిర్మాణం, పూడికతీత పనులు ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించింది. అడయారు, బకింగ్‌హామ్ కాలువ, కొశస్థలి, కెప్టెన్ కాలువల్లో పూడికతీత పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని స్పష్టం చేసింది. ప్రధానంగా వర్షపు నీరు సాఫీగా వెళ్ళేలా నీటి తామర లేకుండా చూడాలని, ఒక్కసారిగా కురిసే కుండపోత వర్షానికే ఉత్పన్నమయ్యే సమస్యలను సమర్థవంతంగా ఎదుర్కొనేలా అన్ని ఏర్పాట్లు ముందస్తుగా చేసుకోవాలని సూచించింది. గత యేడాది వర్షాకాలంలో నీరు నిల్వ ఉన్న నగర ప్రాంతాల్లో ఈ యేడాది చుక్క నీరు నిల్వకుండా చూడాలని మంత్రివర్గ ఉపసంఘం స్పష్టం చేసింది.

రూ.200 కోట్లతో మరో కంపెని

● చెన్నైలో ఈటాన్ ఉత్పత్తి కేంద్రం
● సీఎం స్టాలిన్ సమక్షంలో ఒప్పందం



ఒప్పంద కార్యక్రమంలో నేతలు, ఉన్నతాధికారులు


చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): విదేశీ పెట్టుబడులే లక్ష్యంగా అమెరికాలో పర్యటిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్.. పలు కంపెనీలతో అవగాహనా ఒప్పందాలు కుదుర్చుకుంటున్నారు. ఇందులో భాగంగా బుధవారం మరో విదేశీ కంపెనీతో ఎంవోయూ చేసుకున్నారు. దాదాపు 500 మందికి ప్రత్యక్ష, పరోక్షంగా ఉపాధి కల్పించేలా రూ.200 కోట్లతో ఐర్లాండ్‌కు చెందిన ఈటాన్ కార్పొరేషన్ ఉత్పత్తి సెంటర్, పరిశోధనా కేంద్రం, డెవలప్‌మెంట్ సెంటర్, అప్లికేషన్ ఇంజనీరింగ్ సెంటర్, అష్యూరెన్స్ ఇండియా తొలి గ్లోబల్ కాంపిటెన్స్ సెంటర్ (జీసీసీ) చెన్నైలో ఏర్పాటు చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి స్టాలిన్ సమక్షంలో రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, ఈటాన్ కార్పొరేషన్ ప్రతినిధులు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. సీఎం స్టాలిన్ సారథ్యంలోని డీఎంకే ప్రభుత్వం 2030 నాటికి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను ఒక ట్రిలియన్ డాలర్లకు చేర్చేందుకు చేస్తున్న కృషిలో భాగంగా పలు విదేశీ కంపెనీల నుంచి పెట్టుబడులను ఆకర్షిస్తున్నారు. ఇందులోభాగంగా గత నెల 28వ తేదీ శాన్‌ఫ్రాన్సిస్కోలో జరిగిన పెట్టుబడిదారుల సదస్సులో నోకియా, పేపాల్, ఈల్డ్ ఇంజనీరింగ్ సిస్టమ్స్, మైక్రోచిప్ టెక్నాలజీ, ఇన్‌బింగ్స్ హెల్త్‌కేర్, అప్లైడ్ మెటీరియల్స్ వంటి ఆరు కంపెనీలతో రూ.900 కోట్ల మేర పెట్టుబడి పెట్టేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. తద్వారా 4100 మందికి ఉపాధి లభించనుంది. అలాగే, రాష్ట్రంలో ఏఐ లేబోరేటరీల ఏర్పాటు కోసం గూగుల్‌తో ఒక ఒప్పందం కుదుర్చుకున్న విషయం తెలిసిందే.

చవితి వేడుకలకు భారీ బందోబస్తు

20 వేల మంది పోలీసులతో భద్రత

● 1500 ప్రాంతాల్లో ప్రతిమల ఏర్పాటుకు అనుమతి
● 11, 14, 15 తేదీల్లో మాత్రమే ఊరేగింపు





పట్టినబాక్కంలో పోలీసుల పహారా

అడయార్, సెప్టెంబరు 4: ఈ నెల 7వ తేదీన వినాయకచవితి పండుగను పురస్కరించుకుని నగరంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా, కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు. దీని కోసం ఏకంగా 20 వేల మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో 1500 ప్రాంతాల్లో మాత్రమే విగ్రహాలను ఏర్పాటు చేయాలని, ఈ నెల 11, 14, 15వ తేదీల్లో విగ్రహాల ఊరేగింపు చేసేందుకు పోలీసులు అనుమతిచ్చారు. అలాగే, వినాయకచవితి వేడుకలను పురస్కరించుకుని పోలీసులు పలు ఆంక్షలు విధించారు. పోలీసులు అనుమతించిన మార్గాల్లో అనుమతించిన తేదీల్లో మాత్రమే విగ్రహాలను నిమజ్జనం కోసం తీసుకెళ్లనున్నారు. నిమజ్జనం చేసే ప్రాంతాల్లో సహాయక కేంద్రాలను ఏర్పాటు చేశారు. చెన్నై నగరంలో వినాయక ఊరేగింపునకు నగర పోలీసులు ఎంపిక చేసిన 17 మార్గాల్లోనే ఊరేగింపులను అనుమతిస్తారు. నుంగంబాక్కం, చింతాద్రిపేట, ఎగ్మోర్, పుదుపేట, పెరంబూరు, వ్యాసార్‌పాడి, పులియంతోపు, పట్టాళం, షావుకార్‌పేట, అయనావరం, ట్రిప్లికేన్, మైలాపూర్, తేనాంపేట, టి.నగర్, ఎంజీఆర్ నగర్, వడపళని, సైదాపేట, విల్లివాక్కం, కొళత్తూరు, తిరుమంగళం, మధురవాయల్, కోయంబేడు, అరుంబాక్కం తదితర ప్రాంతాల్లో పోలీసులు నిర్దేశించిన మార్గాల్లోనే ఊరేగింపుగా వెళ్ళి పట్టిణంపాక్కం, శ్రీనివాసపురం వద్ద నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. ఇందుకోసం ఇప్పటి నుంచే అక్కడ పోలీసు పహారా ఏర్పాటు చేశారు. అదేవిధంగా అడయారు, గిండి, ఆదంబాక్కం, మడిప్పాక్కం, నంగనల్లూరు, వేళచ్చేరి, తిరువాన్మియూరులతో పాటు పరిసర ప్రాంతాల్లోని విగ్రహాలను నీలాంగరై పల్‌కలై నగర్ వద్ద సముద్రంలో నిమజ్జనం చేయాల్సి ఉంటుంది. ఉత్తర చెన్నై ప్రాంతాలైన మింట్, రాయపురం, వాషర్‌మెన్‌పేట, తండయారుపేట, ఆర్‌కే నగర్, కొడుంగయూర్, మాధవరం ప్రాంతాల్లో ఏర్పాటు చేసే విగ్రహాలను కాశిమేడు వద్ద సముద్రంలో నిమజ్జనం చేసేలా ఏర్పాట్లు చేశారు. నగరంలోని ఇతర బహిరంగ ప్రదేశాల్లో పెట్టే విగ్రహాల నిమజ్జనం... పోలీసులు సూచించిన నిబంధనలకు లోబడి ఊరేగింపుగా తీసుకెళ్ళాల్సి ఉంటుంది. ఈ ఊరేగింపు కోసం విధించిన ఆంక్షలను, నిబంధనలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని నగర పోలీస్ కమిషనర్ అరుణ్ హెచ్చరించారు.

ఇలాంటి నటులు దేశాన్ని కాపాడగలరా?

అభిమానులకే అధిక ధరలకు టిక్కెట్ల విక్రయం ● మంత్రి అన్వరసన్ వ్యాఖ్యలు



అడయార్, సెప్టెంబరు 4: తమ సినిమాల టిక్కెట్లను అభిమానులకే అధిక ధరలకు విక్రయించే వారు దేశాన్ని కాపాడగలరా? అంటూ మంత్రి టీఎం అన్బరసన్ హీరో విజయ్‌ను ఉద్దేశించి ఘాటుగా విమర్శలు చేశారు. మంగళవారం రాత్రి మాంగాడులో జరిగిన డీఎంకే ఆలందూరు నియోజకవర్గ ప్రతినిధుల సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇటీవల రాజకీయ పార్టీని స్థాపించిన ఒక నటుడు పబ్లిక్ పరీక్షల్లో అత్యుత్తమ ప్రతిభ కనపరచిన విద్యార్థులకు నగదు బహుమతి, ప్రశంసా పత్రాలను అందజేస్తున్నారని, కానీ తమ పార్టీ ఎప్పటి నుంచో ఈ తరహా బహుమతులు ఇస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తోందన్నారు. ఒక సినిమాకు రూ.200 కోట్ల వరకు పారితోషికం తీసుకునే హీరో విజయ్.. తన అభిమానులకు తన కొత్త సినిమా విడుదల రోజున ఉచితంగా టిక్కెట్లు పంపిణీ చేయలేరా అని ప్రశ్నించారు. తన సినిమా టిక్కెట్లను తన అభిమానులకే రూ.2 వేలు చొప్పున విక్రయిస్తున్నారని విమర్శించారు. తమ పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జరుగుతోందని, అందువల్ల ప్రతి నేతా ఇంటింటికి వెళ్ళి కొత్త సభ్యత్వాలపై చర్యలు తీసుకోవాలన్నారు. ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో 40 లోక్‌సభ స్థానాలకు 40 ఎంపీ స్థానాలను కైవసం చేసుకున్నామని, వచ్చే 2026లో జరిగే లోక్‌సభ ఎన్నికల్లో కూడా ఇదే తరహా ఫలితాలు పునరావృతమయ్యేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. అదేసమయంలో ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలను ప్రజలకు మరింతగా చేరువ చేసేలా ప్రచారం చేయాలని మంత్రి అన్బరసన్ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు.



బ్రాడ్వే బస్ స్టేషన్ నిర్మాణానికి రూ.822.70 కోట్లు

● పదంతస్తుల్లో భవనసముదాయం

చెన్నై, సెప్టెంబరు4(ఆంధ్రజ్యోతి): గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ ఆధ్వర్యంలో బ్రాడ్వేలో ప్రస్తుతం సిటీ బస్టాండుగా ఉన్న ప్రాంతంలో కొత్త బస్‌స్టేషన్ నిర్మించేందుకు సవరించిన అంచనాల ప్రకారం రూ.822.70కోట్ల విడుదలకు రాష్ట్ర ప్రభుత్వం అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బ్రాడ్వే బస్‌స్టేషన్ నిర్మాణంలో భాగంగా మల్టీ మాడల్ ఫెసిలిటీ కాంప్లెక్స్ (ఎంఎంఎఫ్‌సీ)భవనాన్ని కూడా నిర్మించనున్నారు. ఈ బస్‌స్టేషన్ నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.200.84 కోట్ల మేరకు నిధులు అందిస్తుంది. ప్రస్తుతం బస్టాండుకు పక్కనే ఉన్న ఖాదీ భవన్‌కు చెందిన కురళగం భవనాన్ని కూల్చి ఆ ప్రాంతాన్ని కూడా బస్‌స్టేషన్‌లో అనుసంధానించేందుకు రూ.115.03 కోట్లను చెన్నై మహానగర అభివృద్ధి సంస్థ (సీఎండీఏ) పదేళ్లలో తిరిగి ఇచ్చేలా రుణసదుపాయం కల్పిస్తుంది. రాష్ట్ర నగరశివారు ప్రాంతాల ఫైనాన్స్ సంస్థ రూ.506.83 కోట్లు సమకూర్చనుంది. ఈ నిధులతో పదంతస్థుల భవన సముదాయంతో పాటు అంతర్జాతీయ సదుపాయాలతో ఈ బస్‌స్టేషన్ నిర్మించనున్నారు. రెండు దిగువ అంతస్థులు, రెండంతస్థులతో కూడిన బస్సుల రాకపోకల ప్రాంతం, ఆరంతస్థుల షాపింగ్‌మాల్స్ ఆ భవన సముదాయంలో ఉంటాయి. ఈ కొత్త బస్‌స్టేషన్ నుంచి రోజూ సుమారు 1100 బస్సులను నడుపనున్నారు. ప్రయాణికులకు ఇబ్బందులు లేకుండా ఈ బస్‌స్టేషన్‌లో ప్రవేశించడానికి ప్రత్యేకమైన ద్వారాలు ఏర్పాటు చేస్తారు. 470 కార్లు, 800 ద్విచక్రవాహనాలు, ఎలక్ట్రిక్ బస్సులకు ఛార్జింగ్ సెంటర్‌లు, ఈ బస్‌స్టేషన్ నుండి సులువుగా పార్క్‌స్టేషన్ చేరుకునేలా స్కైవాక్ తదితర సదుపాయాలు కూడా ఏర్పాటు చేస్తారు.

రోడ్డు ప్రమాదంలో నలుగురి దుర్మరణం



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన కారు

పెరంబూర్, సెప్టెంబరు 4: స్థానిక ఈసీఆర్ రోడ్డులో బుధవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. పోలీసుల కథనం మేరకు... చెన్నైకి చెందిన మహమ్మద్ ఆషిక్ విదేశాల్లో ఉద్యోగం చేస్తూ ఈ నెల 3వ తేది నగరానికి వచ్చాడు. ఆషిక్ తన స్నేహితులు ఆటిల్ మహమ్మద్, అస్లామ్ మహ్మద్, సుల్తాన్‌తో కలసి కారులో మంగళవారం చెన్నై నుంచి పుదుచ్చేరి వెళ్లాడు. అక్కడి నుంచి బుధవారం ఉదయం నగరానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈసీఆర్ రోడ్డులో వేగంగా వస్తున్న కారు అదుపుతప్పి బ్యారికేడ్‌ను ఢీకొని, రోడ్డు పక్కనే నిలిచి ఉన్న లారీని బలంగా ఢీకొంది. ఈ ఘటనలో కారు నుజ్జునుజ్జు కాగా, నలుగురు తీవ్రగాయాలతో ఘటనా స్థలంలోనే మృతిచెందారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని కారు శిథిలా నుంచి మృతదేహాలు వెలికితీసి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించి, ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈ ప్రమాదం కారణంగా ఈసీఆర్ రోడ్డులో సుమారు గంటసేపు వాహన రాకపోకలు స్తంభించాయి.

సమాచార ధ్వని

ఆన్‌లైన్‌లో కార్మికుల సంక్షేమ నిధి చెల్లింపులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: కార్మికుల సంక్షేమ నిధిని ఆన్‌లైన్‌లో చెల్లించేలా తమిళనాడు కార్మిక సంక్షేమ బోర్డు చర్యలు చేపట్టింది. కర్మాగారాలు, ఆహార సంస్థలు, దుకాణాలు అన్ని సంస్థలు తమ వద్ద పనిచేసే కార్మికులకు ప్రతి ఏటా కార్మికుల సంక్షేమ నిధి చెల్లించాల్సి ఉంది. కార్మికుల వాటాగా రూ.20, సంస్థ వాటాగా రూ.40 మొత్తం రూ.60 కార్మిక సంక్షేమ బోర్డుకు చెల్లించాలి. ప్రస్తుతం ఈ నిధి ఆన్‌లైన్‌లో చెల్లించేలా lwmis.lwb.tn.gov.in అనే వెబ్‌సైట్ పరిచయం చేశారు. ఈ వెబ్‌సైట్‌లో సంస్థలు కార్మిక సంక్షేమ నిధి చెల్లించాలని బోర్డు కమిషనర్ ఉమాదేవి తెలిపారు.

అక్టోబరులో గ్రూప్-4 ఫలితాల విడుదల

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: గ్రూప్-4 పరీక్షా ఫలితాలు అక్టోబరులో విడుదల చేయనున్నట్లు టీఎన్‌పీఎస్సీ ప్రకటించింది. గ్రూప్-4లో వీఏఓ 108, జూనియర్ అసిస్టెంట్ 2,604, టైపిస్ట్ 1,705, స్టెనోగ్రాఫర్ 445, ప్రత్యేక సహాయకులు, క్లర్క్ మూడు పోస్టులు, ప్రత్యేక కార్యదర్శి నాలుగు సహా 6,244 ఖాళీ పోస్టుల భర్తీకి గత జూన్ 9వ తేది రాతపరీక్ష జరిగింది. ఈ పోస్టులకు సుమారు 15.80 లక్షల మంది రాశారు. ఈ పరీక్షా ఫలితాలు అక్టోబరులో విడుదల చేయనున్నామని అధికారులు తెలిపారు.

28,29న స్టార్టప్ ఉత్సవాలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: రాష్ట్రప్రభుత్వ స్టార్టప్ టీఎన్ సంస్థ ఆధ్వర్యంలో స్టార్టప్ సంస్థలు ప్రారంభాన్ని ప్రోత్సహించేలా మదురైలో ఈ నెల 28,29 తేదీల్లో స్టార్టప్ ఫెస్టివల్ జరుగనుంది. కొత్త వృత్తులు ప్రారంభించడంపై సలహాలు, పెట్టుబడులు అవసరమయ్యే సంస్థలకు మార్గదర్శకాలు, పెట్టుబడిదారులను సమన్వయం పరిచే కార్యక్రమాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు స్టార్టప్ టీఎన్ వెబ్‌సైట్‌లో పేరు నమోదుచేసుకోవాలని ఆ సంస్థ ప్రధాన కార్యాచరణ అధికారి శివరాజ రామనాథన్ తెలిపారు.

విద్యార్థులకు ఉచిత ఈత శిక్షణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మొగప్పేర్‌లో ఉన్న డాల్ఫిన్ ఈత శిక్షణ అకాడమీ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఉచిత ఈత శిక్షణ ప్రారంభించారు. ఈ విషయమై అకాడమి డైరెక్టర్ మురళీధరన్ మాట్లాడుతూ... ప్రభుత్వ, కార్పొరేషన్ పాఠశాలల్లో 3 నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు మాత్రమే ఈ శిక్షణ ఇస్తున్నామని తెలిపారు. ఔత్సాహికులు 9444906878 అనే నెంబరులో సంప్రదించాలని ఆయన తెలిపారు.

నేటినుంచి ప్రత్యేక బస్సులు

పెరంబూర్, సెప్టెంబరు 4: వినాయక చవితి పండుగ, వారాంతపు సెలవులు పురస్కరించుకొని గురువారం నుంచి ఈ నెల 8వ తేది వరకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎస్‌ఈటీసీ ఓ ప్రకటనలో తెలిపింది. స్థానిక కిలంబాక్కం బస్ టెర్మినల్ నుంచి 725 బస్సులు, కోయంబేడు నుంచి 190 బస్సులు, మాధవరం నుంచి 20 ప్రత్యేక బస్సులు నడపనున్నారు. అలాగే, సెలవులు ముగించుకొని తిరిగి వచ్చే ప్రజల సౌకర్యార్థం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఎస్‌ఈటీసీ తెలియజేసింది.

గ్రూప్-2 హాల్‌టిక్కెట్ల విడుదల

పెరంబూర్, సెప్టెంబరు 4: టీఎన్‌పీఎస్సీ గ్రూప్-2 ప్రిలిమినరీ పరీక్షల హాల్‌టిక్కెట్లు బుధవారం విడుదయ్యాయి. గ్రూప్-2, 2ఏ విభాగాల్లో మొత్తం 2,327 పోస్టుల భర్తీకి గత నెల 20వ తేది టీఎన్‌పీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పోస్టులకు 7.93 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారు. ఇందుకు సంబంధించిన ప్రిమిలినరీ పరీక్ష ఈ నెల 14వ తేది ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగనున్నాయి. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు టీఎన్‌పీఎస్సీ వెబ్‌సైట్ నుంచి హాల్‌టిక్కెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని అధికారులు తెలిపారు.

వినాయక చవితి సందర్భంగా ప్రత్యేక రైళ్లు

పెరంబూర్, సెప్టెంబరు 4: వినాయక చవితి సందర్భంగా ప్రయాణికుల సౌకర్యార్థం చెన్నై సెంట్రల్-కోయంబత్తూర్ మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. నెం.06151 చెన్నై సెంట్రల్ రైల్వేస్టేషన్ నుంచి శుక్రవారం మధ్యాహ్నం 3.45 గంటలకు బయల్దేరే ప్రత్యేక రైలు రాత్రి 11.45 గంటలకు కోయంబత్తూర్ చేరుకుంటుంది. మరుమార్గంలో నెం.06152 కోయంబత్తూర్ నుంచి ఆదివారం రాత్రి 11.30 గంటలకు బయల్దేరి మరుసటిరోజు ఉదయం 7.35 గంటలకు చెన్నై సెంట్రల్ చేరుకుంటుంది. ఈ రైళ్లు పెరంబూర్, తిరువళ్లూర్, అరక్కోణం, కాట్పాడి, జోలార్‌పేట, సేలం, ఈరోడ్, తిరుప్పూర్, తదితర రైల్వేస్టేషన్లలో ఆగనున్నాయి.

నేడు విద్యుత్ గ్రీవెన్స్

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: స్థానిక అడయార్ ప్రాంతంలో గురువారం ఉదయం 10.30 గంటలకు విద్యుత్ గ్రీవెన్స్ జరుగనుంది. అడయార్ మండల పరిధికి చెందిన వినియోగదారులు వేళచ్చేరి మెయిన్ రోడ్డులో ఉన్న ఉప విద్యుత్ కేంద్ర ప్రాంగణంలో నిర్వహించే గ్రీవెన్స్‌లో పాల్గొని తమ సమస్యలకు పరిష్కారం పొందాలని అధికారులు సూచించారు.

ప్రైవేటు అభ్యర్థులు పరీక్ష రాసేందుకు అవకాశం

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: అఖిల భారత వృత్తి పరీక్షను ప్రైవేటు విద్యార్థులు రాసేందుకు ఈ నెల 18వ తేది వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. 2025 జూలైలో హస్త కళాకారుల శిక్షణా పథకం కింద జాతీయ వృత్తి శిక్షణ కమిటీ నిర్వహించే పరీక్ష రాసేందుకు www.skilltraining.tn.gov.in అనే వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు చేసుకొని, పరీక్షా ఫీజు రూ.200 చెల్లించి పూర్తిచేసిన దరఖాస్తులను జిల్లా ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రం ప్రిన్సిపాల్‌కు సమర్పించాలి. అక్టోబరు 15,16 తేదీల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. ఇతర వివరాలకు కూడా అదే వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

విద్యార్థులకు వక్తృత్వ పోటీలు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: దేశం కోసం శ్రమించిన నేతల జయంతి రోజుల్లో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించనున్నట్లు ప్రభుత్వం తెలిపింది. తమిళాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేది అన్నా జయంతి, పెరియార్ జయంతి సందర్భంగా 17వ తేది ఉత్తర, మధ్య, దక్షిణ చెన్నైలకు చెందిన పాఠశాల విద్యార్థులకు వక్తృత్వ పోటీలు జరుగనున్నాయి. గెలుపొందే విదార్థులకు మొదటి బహుమతిగా రూ.5,000, రెండవ బహుమతి రూ.3,000, మూడవ బహుమతి రూ.2,000 అందజేస్తారు. 13వ తేది ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డా.అంబేడ్కర్ ఆర్ట్స్ కళాశాల, క్వీన్ మేరీస్ కళాశాల విద్యార్థులకు పోటీలు జరుగనున్నాయి. అలాగే, ఈ రెండు కళాశాలల్లో 17వ తేది కూడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేయనున్నారు.

రేషన్ కోసం ఆధార్ రెన్యువల్ తప్పనిసరి కాదు

● రాష్ట్రప్రభుత్వం



ప్యారీస్, సెప్టెంబరు 4: రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ నిర్వహణలో పనిచేస్తున్న చౌక దుకాణాలలో సరుకులు పొందేందుకు ఆధార్ రెన్యువల్ తప్పనిసరి కాదని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. దేశవ్యాప్తంగా 140.20 కోట్ల మందికి ఆధార్ కార్డు ఉంది. దీంతో ఆధార్ కార్డును ఈ నెల 14వ తేది వరకు తప్పనిసరిగా రెన్యువల్ చేయించుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఈ నేపథ్యంలో, ఆధార్‌లో వేలిముద్రలు రెన్యువల్ చేయకుంటే రేషన్ సరుకులు పంపిణీ చేయరని సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేస్తున్నాయి. దీనిపై స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం.. నిజనిర్ధారణ కమిటీ ద్వారా బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. రేషన్ దుకాణాల్లో చేతిముద్రలు, కనుబొమ్మల నమోదు ప్రక్రియ సుమారు 85 శాతం పూర్తయ్యాయని, ఈ రెన్యువల్ విఫలమైన పక్షంలో కుటుంబ కార్డుదారులచే రిజిస్టర్‌లో సంతకం చేయించి రేషన్ సరుకులు అందజేస్తున్నట్లు ప్రభుత్వం తెలిపింది. ప్రస్తుతం చేపట్టిన ఆధార్ రెన్యువల్‌కు, రేషన్ సరుకులు పొందేందుకు ఎలాంటి సంబంధం లేదని, ఇలాంటి వదంతులు పుట్టిస్తున్న వారిపై కఠినచర్యలు చేపడతామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది.

నాలుగు మండలాల్లో మురుగునీరు తొలగింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: నగరంలోని నాలుగు మండలాల్లో మురుగునీరు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి. వ్యాసర్పాడి జీవా రైల్వేస్టేషన్ సమీపంలో సబ్ వే పనుల కోసం అంబేడ్కర్ రోడ్డులో మురుగునీరు పైప్‌కు వాల్వు పనులు చేపట్టనున్నారు. ఈ కారణంగా తిరువికనగర్ మండలం పురుషవాక్కం మురుగునీటి పంపింగ్ స్టేషన్ రెండు రోజులు పనిచేయదు. దీంతో, రాయపురం, తిరువికనగర్, అన్నానగర్, తేనాంపేట మండలాల్లో యంత్రాల ద్వారా డ్రైనేజీల్లో మురుగునీరు తొలగింపు పనులు ప్రారంభమయ్యాయి.

50 లక్షల టన్నుల సరుకుల రవాణా

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: చెన్నై హార్బర్‌లో 50 లక్షల టన్నుల సరుకుల రవాణా జరిగింది. ఈ హార్బర్ నుంచి కార్లు, ఆహార పదార్థాలు సహా వివిధ వస్తువులు విదేశాలకు ఎగుమతి చేస్తుండగా, విదేశాల నుంచి యంత్రాలు, మందులు, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్ సాధనాలు సహా పలు వస్తువులు దిగుమతి అవుతున్నాయి. గడిచిన పదేళ్లలో తొలిసారిగా ఆగస్టులో అత్యధికంగా 5.045 మిలియన్ టన్నుల సరుకుల రవాణా జరిగింది. ఇదే విధంగా, గత ఆగస్టులో 20 అడుగుల పొడవున్న 1.70 లక్షల గూడ్సు కంటైనర్లు తరలించారు. 2021 అక్టోబరులో అతి తక్కువగా 1.53 లక్షల టన్నుల కంటైనర్లు తరలించారు. గత నెల 31వ తేది ఒకేరోజు 23,534 టన్నుల సరుకులు దిగుమతి అయ్యాయి. 2023 నవంబరు 23వ తేది ఒకేరోజు 20,100 టన్నుల సరుకులు దిగుమతి అయ్యాయి.

మదురై ప్రపంచ తమిళ సంఘం పునరుద్ధరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: మదురై ప్రపంచ తమిళ సంఘం ఎనిమిదేళ్ల అనంతరం పునరుద్ధరించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం తెలిపింది. రాష్ట్ర సంఘాల రిజిస్ట్రేషన్ చట్టం-1975 ప్రకారం మదురై జిల్లా రిజిస్టర్ కార్యాలయంలో మదురై ప్రపంచ తమిళ సంఘం రిజిస్ట్రేషన్ జరిగింది. ప్రతి ఆర్థిక సంవత్సరం ముగిసిన అనంతరం సెప్టెంబరులోగా సంవత్సరానికి సంబంధించిన ఆదాయ, వ్యయాలు నివేదిక సమర్పించి రెన్యువల్ చేసుకోవాల్సి ఉంటుంది. అయితే ఎనిమిదేళ్లుగా ఈ సంఘం రెన్యువల్ కాలేదు. ఈ నేపథ్యంలో, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు 2023 మే నెలలో రెన్యువల్‌కు సంబంధించి అధికారులు చర్యలు చేపట్టారు. ఆ ప్రకారం, ఈ ఏడాది జూలై 10వ తేది ఎనిమిదేళ్ల అనంతరం సంఘ నిబంధనల ప్రకారం రెన్యువల్ జరిగిందని ప్రభుత్వం ప్రకటించింది. దీని ద్వారా ఇకపై సంఘం యధావిధిగా పనిచేస్తుందని పేర్కొంది.

తగ్గిన ధాన్యం కొనుగోళ్లు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: తంజావూరు, తిరువారూరు తదితర డెల్టా జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్లు 4 లక్షల టన్నులకు తగ్గింది. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర వినియోగవస్తువుల వాణిజ్య సంస్థ రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేస్తోంది. ఇందుకోసం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి రైతులకు గిట్టుబాటు ధర అందజేస్తోంది. 2023 సెప్టెంబరు 1వ తేది ప్రారంభమైన కొనుగోలు సీజన్ ఈ సంవత్సరం ఆగస్టు 31వ తేదీతో ముగిసింది. ఈ సీజన్‌లో 3,209 కొనుగోలు కేంద్రాల ద్వారా 34.96 లక్షల టన్నుల ధాన్యం కొనుగోలు చేశారు. 2022-23 సీజన్‌లో 44.22 లక్షల టన్నులు కొనుగోళ్లు జరిగాయి. గత సీజన్‌తో పోల్చితే, ఈ సారి 4.33 లక్షల టన్నుల మేర కొనుగోళ్లు తగ్గాయి.

స్మార్ట్ మీటరు పథకం అమలు చేస్తేనే సబ్సిడి

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: స్మార్ట్ మీటరు పథకాన్ని సక్రమంగా అమలుపరచని పక్షంలో సబ్సిడీ ఇవ్వమని రాష్ట్ర విద్యుత్ బోర్డును కేంద్ర విద్యుత్ శాఖ హెచ్చరించింది. దేశవ్యాప్తంగా ఈ పథకం కింద విద్యుత్ నష్టాన్ని జీరోస్థాయికి తగ్గించేందుకు కొత్త విద్యుత్ మార్గం ఏర్పాటు చేయనున్నారు. విద్యుత్ విక్రయానికి తగ్గట్లు ఆదాయం లభించడాన్ని ఖరారు చేసేలా ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ మార్గాల్లో స్మార్ట్ మీటర్లు ఏర్పాటుచేయనున్నారు. రాష్ట్రంలో రూ.10,600 కోట్లతో చేపట్టనున్న ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపి, రూ.6,360 కోట్ల రుణం అందజేయనుంది. ఈ ఏడాదిలోగా ఈ పథకం పనులు పూర్తిచేస్తే కేంద్ర ప్రభుత్వం అందించే రుణాన్ని తిరిగి చెల్లించే అవసరం లేదు. ఈ రుణాన్ని సబ్సిడీగా పరిగణిస్తారు. లేని పక్షంలో వడ్డీతో పాటు రుణం తిరిగి చెల్లించాలని విద్యుత్ బోర్డును కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది.

సిద్ధ, ఆయుర్వేద కోర్సులకు 7,350 దరఖాస్తులు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: సిద్ధ, ఆయుర్వేద కోర్సుల్లో చేరేందుకు 7,350 మంది దరఖాస్తు చేసుకున్నారు. అరుంబాక్కం అన్నా ప్రభుత్వాసుపత్రి ప్రాంగణంలో సిద్ధ, యునానీ వైద్యకళాశాలలు, తిరునల్వేలిలో హోమియో వైద్యకళాశాల, కన్నియాకుమారి జిల్లా కోత్తారులో ఆయుర్వేద వైద్యకళాశాల ఉన్నాయి. ఇవి మినహా మరో 30 ప్రైవేటు వైద్యకళాశాలల్లో బీఎస్ఎంఎస్-బీఏఎంఎస్, బీయూఎంఎస్-బీహెచ్ఎంఎస్ కోర్సుల్లో చేరేందుకు ఆగస్టు 4 నుంచి 22వ తేది వరకు దరఖాస్తు స్వీకరణ జరిగింది. మొత్తం 7,350 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ కళాశాలల్లో ఉన్న 330 సీట్లలో అఖిల భారత కోటాకు 50 సీట్లు, రాష్ట్ర ప్రభుత్వ కోటాకు 280 సీట్లు కేటాయించారు. ప్రైవేటు కళాశాలల్లో ఉన్న 1,980 సీట్లలో 15 శాతం సీట్లు అఖిల భారత కోటాకు, మిగిలిన కోటా సీట్లు రాష్ట్రప్రభుత్వం, మేనేజ్‌మెంట్ కోటాలో ఉన్నాయి. త్వరలో ర్యాంకుల జాబితా విడుదల చేసి అక్టోబరులో కౌన్సెలింగ్ నిర్వహించేందుకు భారత వైద్యం, హోమియోపతి శాఖ తెలియజేసింది.

నాసిరకం వంగడాలపై నిషేధం

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: మొలకెత్తే సామర్థ్యం లేని నాసికరం వంగడాలపై రాష్ట్రప్రభుత్వ విత్తనాల భద్రత విభాగం నిషేధం విధించింది. తంజావూరు జిల్లాలో అమ్మాపేట, తంజావూరు, మారియమ్మన్ కోయిల్, సాయిమంగళం సహా 18 ప్రైవేటు, ప్రభుత్వ విత్తనాల విక్రయ కేంద్రాల్లో ప్రభుత్వ విత్తనాల భద్రతా విభాగం అధికారులు తనిఖీలు నిర్వహించారు. 36 విత్తన నమూనాలను పరిశీలించగా అవి నాసిరకంగా తెలిసింది. నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.5.79 లక్షల విలువైన 22,750 కిలోల విత్తనాల విక్రయాలపై నిషేధం విధించారు. తిరువారూర్ జిల్లా నన్నిలం, కుడవాసల్, తిరువారూరు ప్రాంతాల్లో 14 విక్రయ కేంద్రాల్లో 161 విత్తన నమూనాలు సేకరించి పరిశోధనలు చేపట్టి, వాటిలో నాసిరకమైన 16,150 కిలోల విత్తనాల విక్రయాలపై నిషేధం విధించారు.

10న పోలీసు వాహన విడిభాగాల వేలం

పెరంబూర్, సెప్టెంబరు 4: మరమ్మతులు చేపట్టేందుకు వీలులేని పాత వాహనాల విడిభాగాలు ఈ నెల 10వ తేది సాయంత్రం 4 గంటలకు ఎగ్మూర్‌లోని సీబీసీఐడీ ప్రాంగణంలో బహిరంగ వేలం వేయనున్నారు. ఈ మేరకు గ్రేటర్ చెన్నై పోలీసు శాఖ బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... వేలం ముగిసిన వెంటనే జీఎస్టీతో కలపి వేలం నగదు చెల్లించాల్సి ఉంటుంది. వేలంలో పాల్గొనే వారు ఆధార్ కార్డు సమర్పించాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 9952022860, 9962488150 నెంబర్లు సంప్రదించవచ్చు.

మాజీ అధ్యాపకుల ఆందోళన



ఆందోళనలో మాజీ అధ్యాపకులు

వేలూరు, సెప్టెంబరు 4: బీమా పథకం వర్తింపజేయాలని కోరుతూ మాజీ కళాశాల అధ్యాపకులు ఆందోళన చేపట్టారు. ముత్తుకడై ప్రాంతంలో బుధవారం జరిగిన ఆందోళనలకు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షణ్ముగం అధ్యక్షత వహించారు. జిల్లా ఉపాధ్యక్షులు రవి, జ్ఞానేశ్వరి, జాయింట్ సెక్రటరీలు దామోదరన్, మదిఅయగన్, మణిమేఘలై తదితరులు పాల్గొన్నారు. రాష్ట్ర కార్యకర్తల కమిటీ సభ్యులు, జిల్లా ఆర్గనైజర్ జనార్ధనన్ ఆందోళన ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కోశాధికారి ఆర్ముగం, తమిళనాడు పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు సుందరేశన్, ప్రభుత్వ రవాణా సంస్థ మాజీ ఉద్యోగుల వేలూరు మండల సెక్రటరీ గోవిందస్వామి, పీఈటీ ఉపాధ్యాయుల రాణిపేట జిల్లా అధ్యక్షుడు మణికంఠన్ తదితరులు పాల్గొన్నారు.

మృతిచెందిన పోలీసు కుటుంబానికి రూ.25 లక్షలు

● సీఎం స్టాలిన్

పెరంబూర్, సెప్టెంబరు 4: విధినిర్వహణలో హఠాత్తుగా అనారోగ్యానికి గురై మృతిచెందిన పోలీసు కుటుంబానికి ప్రగాఢ సానుభూతితో పాటు ఆర్థిక సాయం అందజేయనున్నట్లు ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రకటించారు. ఈ మేరకు సచివాలయం బుధవారం విడుదల చేసిన ప్రకటనలో... స్థానిక మీనంబాక్కం పోలీస్‌స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న రవికుమార్(59) మంగళవారం ఉదయం మీనంబాక్కం సమీపంలోని జాతీయ రహదారిపై డ్యూటీలో ఉండగా హఠాత్తుగా అనారోగ్యానికి గురై మృతిచెందాడు. ఈ వార్త తనకు దిగ్భ్రాంతి కలుగుజేసిందని, రవికుమార్ కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలుపడంతోపాటు ఆయన కుటుంబానికి రూ.25 లక్షలు అందజేయనున్నట్లు సీఎం స్టాలిన్ ప్రకటించారు.

మాకు శత్రువులు పెరిగిపోతున్నారు

● మంత్రి కేఎన్ నెహ్రూ

అడయార్, సెప్టెంబరు 4: తమకు నానాటికీ శత్రువులు పెరిగిపోతున్నారని, అందువల్ల వచ్చే ఎన్నికల్లో సుహృద్భావ వాతావరణంలో కూటమి ఏర్పడే అవకాశాలు లేవని మంత్రి కేఎన్ నెహ్రూ వ్యాఖ్యానించారు. తిరుచ్చి జిల్లా లాల్గుడి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో డీఎంకే ప్రతినిధుల సమావేశం జరిగింది. ఇందులో పాల్గొన్న మంత్రి నెహ్రూ మాట్లాడుతూ ముగిసిన లోక్‌సభ ఎన్నికల్లో ఏర్పాటైన కూటమి వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో తిరిగి పునరావృతమవుతుందా లేదా అన్నది అనుమానమన్నారు. ఎందుకంటే, సీమాన్ మనపై విమర్శలు గుప్పిస్తున్నారు. మరో నటుడు కొత్తగా రాజకీయ పార్టీ స్థాపించారు. మరోవైపు, వచ్చే ఎన్నికల్లో మేమేనంటూ అన్నాడీఎంకే ప్రచారం చేసుకుంటుందన్నారు. ప్రజలకు ఎంతో మేలు చేస్తున్నప్పటికీ పీఎంకే విమర్శలు చేస్తూనే ఉందని, ఇక బీజేపీ సంగతి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదన్నారు. అందువల్ల వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో సామరస్యపూర్వక కమిటీ ఏర్పడుతుందా? లేదా? అన్నది సందేహాస్పదమన్నారు. అయినప్పటికీ పార్టీ విజయం కోసం ప్రతి ఒక్కరం కృషి చేయాలని మంత్రి నెహ్రూ పిలుపునిచ్చారు.

ప్రభుత్వ ఆస్పత్రుల్లో భద్రత పెంపు

● మూడు దశల సమీక్ష

అడయార్, సెప్టెంబరు 4: రాష్ట్రంలోని ప్రభుత్వ వైద్య కాలేజీలు, ఆస్పత్రుల్లో వైద్య సిబ్బందికి భద్రత పెంచారు. మూడు దశల సమీక్షల మేరకు ఈ భద్రత రెట్టింపు చేశారు. ఇదే విషయంపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు మాట్లాడుతూ, కోల్‌కతా మెడికో హత్యాచార ఘటన తర్వాత రాష్ట్రంలోని ప్రభుత్వ ఆస్పత్రుల్లో వైద్యులు, వైద్య సిబ్బందిపై దాడులు జరుగకుండా గట్టి భద్రత కల్పించేలా మూడు దఫాలుగా సమీక్ష జరిగిందన్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం శాఖ కార్యదర్శి, డీజీపీలతో కూడా సమీక్ష నిర్వహించి, వైద్య కాలేజీల్లోని విద్యార్థినులు, ఆస్పత్రుల్లోని వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించేలా చర్యలు చేపట్టినట్టు తెలిపారు.

ప్రభుత్వాసుపత్రి తనిఖీ



ప్రసూతి వార్డును పరిశీలిస్తున్న కలెక్టర్ సుబ్బులక్ష్మి

వేలూరు, సెప్టెంబరు 4: స్థానిక అన్నాసాలైలోని ప్రభుత్వ పెండలెంట్ ఆసుపత్రిని కలెక్టర్ సుబ్బులక్ష్మి బుధవారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని పిల్లల విభాగం, పురుషులు, మహిళల జనరల్ విభాగాలు, ఆపరేషన్ గది, తదితరాలను కలెక్టర్ పరిశీలించారు. ఆ సమయంలో ఓపీ విభాగం ప్రజలు కుర్చీలు లేకుండా నిలబడి ఉండడం గమనించిన కలెక్టర్, అవసరమైన కుర్చీలు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు.

7న తిరునల్వేలి మీదుగా వెళ్లే రైళ్ల రద్దు

ప్యారీస్, సెప్టెంబరు 4: తెలుగు రాష్ట్రాలను వరదలు ముంచెత్తిన కారణంగా తిరునల్వేలి మీదుగా వెళ్లే రెండు రైళ్లను ఈ నెల 7వ తేది రద్దు చేసినట్లు దక్షిణ రైల్వే ప్రకటించింది. భారీవర్షాల కారణంగా నాలుగు రోజులుగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాల్లోని ఎలు ప్రాంతాల్లో రైలుపట్టాలపై వరద నీరు నిలిచింది. ఇప్పటికే దక్షిణ జిల్లాల నుంచి తెలుగు రాష్ట్రాలకు నడుపుతున్న పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు కొన్ని రైళ్లను వేరే మార్గంలో నడుపుతున్నారు. దెబ్బతిన్న రైల్వే ట్రాక్ మరమ్మతులు పూర్తి కానుందువల్ల ఈ నెల 7వ తేది కన్నియాకుమారి నుంచి తిరునల్వేలి, మదురై మీదుగా వెళ్లే హౌరా ఎక్స్‌ప్రెస్, అదే రోజు తిరునల్వేలి నుంచి తెల్లవారుజామున 3.15 గంటలకు బయల్దేరే బ్రూలియా ఎక్స్‌ప్రెస్ రైళ్లు రద్దయ్యాయి.

దేవాదాయ శాఖ స్థలాలు నమోదుచేయాలి

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: రిజిస్ట్రేషన్ శాఖలో హిందూ దేవాదాయ శాఖ స్థలాలు నమోదు చేయకపోతే చర్యలు చేపట్టనున్నట్లు రిజిస్ట్రేషన్ శాఖ ఐజీ దినేష్ పొన్‌రాజ్ ఆలివర్ తెలిపారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలకు పంపిన ఉత్తర్వుల్లో.. హిందూ దేవాదాయ శాఖ, కలైమగల్ సభ, బీఎస్‌సీఎల్ సంబంధించిన స్థలాలు, భూములు, ఆస్తులను రిజిస్ట్రేషన్ చేయడంపై నిషేధం ఉండేదని తెలిపారు. ప్రస్తుతం ఈ విధానంలో మార్పులు రావడంతో వీటి రిజిస్ట్రేషన్లకు అనుమతి లభించిందని తెలిపారు. ఆ ప్రకారం, నెలరోజుల్లోపు హిందూ దేవాదాయ శాఖ స్థలాలు నమోదు చేయాలని సూచించారు.

పచ్చయప్ప కళాశాల విద్యార్థుల ధర్నా

ప్యారీస్, సెప్టెంబరు 4: స్థానిక అమింజికరై ప్రాంతంలోని పచ్చయప్ప కళాశాల యాజమాన్యానికి వ్యతిరేకంగా బుధవారం విద్యార్థులు కళాశాల ప్రాంగణంలో బైఠాయించి ధర్నా నిర్వహించారు. ఈ కళాశాల ట్రస్ట్ నిర్వాహక కమిటీకి కొన్నేళ్లుగా ఎన్నికలు నిర్వహించని కారణంగా కళాశాలలో విద్యార్థులకు కనీసవసతులు కల్పించలేని పరిస్థితి నెలకొంది. ఈ వ్యవహారంలో ఓ మహిళా ప్రొఫెసర్‌ను ట్రస్ట్ కార్యదర్శి కించపరిచే విధంగా మాట్లాడినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో, కళాశాల యాజమాన్యం వైఖరిని ఖండిస్తూ విద్యార్థులు నిరసన తెలిపారు. కీల్పాక్కం ఏసీపీ నేతృత్వంలో కళాశాల వద్ద పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేశారు.

కూవం తీరంలోని శ్మశానం పునరుద్ధరణ

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: స్థానిక నెర్‌కుంద్రంలోని కూవం నదితీరంలో ఉన్న శ్మశానవాటిక పునరుద్ధరణ పనులను కార్పొరేషన్ ప్రారంభించింది. వలసరవాక్కం మండలం 145వ వార్డు నెర్‌కుంద్రం-పూందమల్లి హైరోడ్డులో కూవం తీరంలో ఉన్న శ్మశానవాటిక పర్యవేక్షణ లేక అధ్వాన్నంగా ఉంది. దీనిని పునరుద్ధరించేందుకు చర్యలు చేపట్టిన కార్పొరేషన్, ఇటీవల పనులు ప్రారంభించింది.

1 నుంచి తూత్తుకుడి-మాల్దీవుల మధ్య నౌకా రవాణా

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: తూత్తుకుడి-మాల్దీవుల మధ్య నౌకా రవాణా అక్టోబరు 1 నుంచి ప్రారంభం కానుంది. రాష్ట్రంలో చెన్నై, ఎన్నూర్ కామరాజర్, తూత్తుకుడి వావూ చిదంబరనార్ హార్బర్లు పనిచేస్తున్నాయి. ఇక్కడి నుంచి సరుకుల నౌక రవాణా జరుగుతోంది. చెన్నై నుంచి అండమాన్‌కు ప్యాసింజర్ నౌకా సేవలు అందుబాటులో ఉన్నాయి. ఇది మినహా ఆగస్టు 16వ తేది నుంచి నాగపట్టణం-శ్రీలంక కాంగేశన్ హార్బర్‌కు ప్రయాణికుల నౌకా రవాణా ప్రారంభించారు. ప్రస్తుతం తూత్తుకుడి హార్బర్ నుంచి మాల్దీవులకు సరుకుల నౌకా రవాణా అక్టోబరు 1వ తేది నుంచి ప్రారంభించనున్నారు.

ఎడప్పాడి, ఆయన సోదరులకు హైకోర్టు నోటీసు

ప్యారీస్, సెప్టెంబరు 4: కావేరి నది నుంచి అధిక హార్స్ పవర్ విద్యుత్ మోటార్లతో నీరు తోడేందుకు అనుమతిచ్చిన కేసులో అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, ఆయన సోదరులను వివరణ కోరుతూ మద్రాసు హైకోర్టు నోటీసు జారీచేసింది. 2020వ సంవత్సరం అన్నాడీఎంకే ప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి ఎడప్పాడి పళనిస్వామి తన అధికారాన్ని దుష్ప్రయోగం చేసి అధిక హార్స్ పవర్లు కలిగిన విద్యుత్ మోటార్లను వినియోగించి కావేరిలో నీరు తోడేందుకు అనుమతిస్తూ జారీచేసిన జీవో రద్దు చేయాలని కోరుతూ సేలంకు చెందిన సెల్వం మద్రాసు హైకోర్టులో పిటిషన్ వేశారు. అందులో... సేలం జిల్లా నెడుంగుళం ప్రాంతానికి చెందిన రైతులకు లబ్ధిచేకూర్చేలా 27 హార్స్ పవర్ సామర్థ్యం కలిగిన విద్యుత్ మోటార్లు వినియోగించేందుకు ఇచ్చిన అనుమతి చట్టవిరుద్ధమని, దీనిపై పళనిస్వామి, ఆయన సోదరులపై అవినీతి నిరోధక శాఖలకు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ కేసు విచారణ హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి కృష్ణకుమార్, న్యాయమూర్తి బాలాజీలతో కూడిన ప్రథమ ధర్మాసనం సమక్షంలో బుధవారం విచారణకు వచ్చింది. పిటిషనర్‌కు రాష్ట్రప్రభుత్వం, పళనిస్వామి, ఆయన సోదరులు సహా 31 మంది వివరణ ఇవ్వాల్సిందిగా ఆదేశించిన ధర్మాసనం, తేది ప్రకటించకుండా విచారణ వాయిదావేసింది.

ఎంఎంసీలో పీజీ విద్యార్థి ఆత్మహత్య

పెరంబూర్, సెప్టెంబరు 4: స్థానిక ఓమందూర్ ఎస్టేట్ ప్రాంగణంలో ఉన్న ప్రభుత్వ వైద్యకళాశాలలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విరుదునగర్ జిల్లాకు చెందిన అరవింద్ (29) బుధవారం ఉదయం తన గదిలో అచేతనంగా పడి ఉండడాన్ని సహచర విద్యార్థులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకొని, అరవింద్ ఆత్మహత్యకు దారితీసిన కారణాలను విచారిస్తున్నారు.

బాణసంచా గోదాములో అగ్నిప్రమాదం

● ఒకరి మృతి

పెరంబూర్, సెప్టెంబరు 4: సేలం జిల్లా అయోధ్యపట్టణం సమీపంలోని బాణాసంచా గోదాములో ముడిపదార్థాలు దిగుమతి చేసుకుంటున్న సమయంలో హఠాత్తుగా మంటలు చెలరేగి జయరామన్ అనే వ్యక్తి మృతిచెందాడు. శివకాశికి చెందిన జయరామన్ అయోధ్యపట్టణం సమీపం పరుత్తికాడు ప్రాంతంలో బాణాసంచా గోదాము నిర్వహిస్తున్నాడు. అనుమతి పొంది నడుపుతున్న ఆ గోదాములో బుధవారం ఉదయం బాణాసంచా దించుతున్న సమయంలో ఒక బస్తా కిందపడి పేలింది. ఈ ఘటనలో జయరామన్ మృతి చెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. స్థానిక పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

32 కిలోల గుట్కా స్వాధీనం

● మాధవరంలో మహిళ అరెస్టు

ప్యారీస్, సెప్టెంబరు 4: స్థానిక మాధవరంలో చట్టవిరుద్ధంగా పాన్‌పరాగ్, గుట్కా తదితర పొగాకు ఉత్పత్తులు విక్రయిస్తున్న మహిళను అరెస్ట్ చేశారు. మాధవరం బస్టాండ్ సమీపంలో ఉన్న లారీ షెడ్‌లో గుట్కా విక్రయాలు జరుగుతందనే సమాచారంతో మాధవరం పోలీసులు మారువేషాల్లో అక్కడ నిఘా వేశారు. ఓ కిరాణా దుకాణంలో పాన్‌పరాగ్ విక్రయిస్తున్న జయలక్ష్మి (28) అనే మహిళను అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఆ దుకాణంలో చిన్న బండళ్లలో ఉన్న హాన్స్, పాన్‌పరాగ్ తదితర 32 కిలోల పొగాకు ఉత్పత్తులు స్వాధీనం చేసుకున్నారు.

అన్నా విశ్వవిద్యాలయానికి బాంబు బెదిరింపు

పెరంబూర్, సెప్టెంబరు 4: స్థానిక అన్నా విశ్వవిద్యాలయానికి బుధవారం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చింది. దీంతో, బాంబ్ స్క్వాడ్, డాగ్ స్క్వాడ్‌తో వచ్చిన పోలీసులు వర్సిటీ ప్రాంగణమంతా తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎలాంటి బాంబులు, పేలుడు పదార్థాలు లేకపోవడంతో అది ఫేక్ మెసేజ్‌గా పోలీసులు నిర్ధారించారు. అదే సమయంలో ఈ-మెయిల్ వచ్చిన చిరునామాపై విచారణ చేపట్టనట్లు పోలీసులు తెలిపారు.

బాంబు పేరుతో బెదిరించింది విద్యార్థులే...!

పెరంబూర్, సెప్టెంబరు 4: ఈరోడ్ అవల్‌పుందూర్ సమీపం చెట్టిపాళయంలో ఉన్న ఓ ప్రైవేటు పాఠశాలకు మంగళవారం ఉదయం ఈ-మెయిల్ ద్వారా బాంబు బెదిరింపు వచ్చిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై పాఠశాల నిర్వాహకుల ఫిర్యాదుతో పోలీసులు పాఠశాలలో తనిఖీ చేసి బాంబు బెదిరింపు ఫేక్ మెసేజ్‌గా నిర్ధారించారు. ఈ విషయమై సైబర్ క్రైం చేపట్టిన విచారణలో ఈ-మెయిల్ పంపింది అదే పాఠశాలలో చదువుతున్న ఇద్దరు విద్యార్థులని గుర్తించారు. దీంతో, విద్యార్థులు, వారి తల్లిదండ్రులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి హెచ్చరించి పంపించారు. పాఠశాలకు సెలవు ఇస్తారని బాంబు బెదిరింపులకు పాల్పడినట్లు ఆ విద్యార్థులు అంగీకరించారని పోలీసులు తెలిపారు.

సబర్బన్ రైలు ఢీకొని ప్రేమ జంట మృతి

పెరంబూర్, సెప్టెంబరు 4: సబర్బన్ రైలు ఢీకొని కేరళ రాష్ట్రానికి చెందిన ప్రేమ జంట మృతిచెందిన ఘటన నగర శివారు ప్రాంతంలో బుధవారం జరిగింది. కేరళ రాష్ట్రం మలప్పురానికి చెందిన మహమ్మద్ షరీఫ్ (35), కోళికోడ్‌కు చెందిన ఐశ్వర్య (28) మధ్య ఏర్పడిన పరిచయం ప్రేమకు దారితీసి వివాహం చేసుకోవాలని నిర్ణయించారు. వీరి వివాహానికి ఇరుతరపు కుటుంబ సభ్యులు నిరాకరించారు. దీంతో, వారిద్దరు ఉద్యోగం కోసం ఇటీవ నగరానికి చేరుకున్నారు. మంగళవారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో వారు గుడువాంజేరి-పొత్తేరి మధ్య రైలుమార్గంపై నడిచి వస్తున్న సమయంలో చెన్నై బీచ్ నుంచి చెంగల్పట్టు వెళ్తున్న సబర్బన్ రైలు ఢీకొంది. ఈ ఘటనలో షరీఫ్ సంఘటనా స్థలంలోనే మృతిచెందగా, ఐశ్వర్యకు తీవ్రగాయాలయ్యాయి. చుట్టుపక్కల వారు ఆమెను సమీపంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్సలు ఫలించక మృతిచెందింది. మృతురాలు ఐశ్వర్య నాలుగు నెలల గర్భంతో ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై రైల్వే పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మహిళా డీఎస్పీపై దాడిలో 116 మందిపై కేసు

ప్యారీస్, సెప్టెంబరు 4: విరుదునగర్ జిల్లా అరుప్పుకోట వద్ద మహిళా డీఎస్పీ గాయత్రిపై దాడికి పాల్పడిన వ్యవహారంలో 116 మందిపై కేసు నమోదుచేసిన పోలీసులు, ఏడుగురిని అరెస్ట్ చేశారు. రామనాథపురం జిల్లా కముది సమీపంలో ఉన్న పెరుమాళ్‌పట్టికి చెందిన కాళికుమార్ అనే లారీ డ్రైవర్‌ను హత్యచేసిన ముఠాను అరెస్ట్ చేయాలని కోరుతూ మంగళవారం అరుప్పుకోట ప్రభుత్వాసుపత్రి సమీపంలో మృతుడి కుటుంబీకులు, బంధువులు రాస్తారోకో చేపట్టారు. ఈ విషయం తెలుసుకున్న డీఎస్పీ గాయత్రి సిబ్బందితో అక్కడకు వెళ్లి ఆందోళనకారులను శాంతింపజేసేందుకు ప్రయత్నించారు. ఇందులో ఆందోళనకారులు కొందరు ఆమెపై దాడికి పాల్పడ్డారనే సమాచారంతో ఎస్పీ కన్నన్ విచారణ జరిపారు. ఈ వ్యవహారంలో బాలమురుగన్, లా కళాశాల విద్యార్థి పొన్‌మురుగన్ సహా ఏడుగురిని అరెస్ట్ చేసిన పోలీసులు, పరారీలో ఉన్న మురుగేశన్ కోసం తీవ్రంగా గాలిస్తున్నారు.

లైంగిక వేధింపుల కేసులో వృద్ధుడికి జీవితఖైదు

ప్యారీస్, సెప్టెంబరు 4: ఏడేళ్ల చిన్నారిని లైంగిక వేధింపులకు గురిచేసిన 80 ఏళ్ల వృద్ధుడికి జీవిత ఖైదు విధిస్తూ తేని జిల్లా పోక్సో న్యాయస్థానం తీర్పు వెలువరించింది. 2020 నవంబరు 25న ఇంటి ముందు ఆడుకుంటున్న ఏడేళ్ల చిన్నారికి చాక్లెట్ ఇచ్చిన నటరాజన్ (80) తనతో ఇంటికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు పాల్పడ్డాడు. దీనిపై ఆ చిన్నారి తల్లిదండ్రులు ఫిర్యాదు చేయడంతో గూడలూరు పోలీసులు కేసు నమోదుచేసి నటరాజన్‌ను అరెస్ట్ చేశారు. ఈ కేసు విచారణ పూర్తయిన నేపథ్యంలో, ముద్దాయి నటరాజన్‌కు జీవిత ఖైదు, రూ.50,000 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి గణేశన్ మంగళవారం తీర్పు వెలువరించారు.

విద్యార్థినిపై సామూహిక అత్యాచారం

● ఐదుగురి కోసం గాలింపు

ప్యారీస్, సెప్టెంబరు 4: తిరుచ్చి సమీపంలో కళాశాల విద్యార్థినిపై సామూహిక అత్యాచారానికి పాల్పడి పరారైన ఐదుగురు కామాంధుల కోసం పోలీసులు గాలిస్తున్నారు. తిరుచ్చి సమీపంలోని ఓ గ్రామానికి చెందిన సిలంబరసన్ అనే కార్మికుడు కళాశాల విద్యార్థినికి మత్తు మందు కలిపిన శీతల పానీయం ఇచ్చి తాగించాడు. ఆమె స్పృహకోల్పోయాక స్నేహితులతో కలసి అత్యాచారానికి పాల్పడినట్లు సమాచారం. ఈ వ్యవహారంపై బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదుచేసిన పోలీసులు, పరారైన సిలంబరసన్ సహా ఐదుగురిని గాలిస్తున్నారు.

మొరట్టాండి టోల్‌గేట్ రుసుము తగ్గింపు

ఐసిఎఫ్, సెప్టెంబరు 4: అన్ని ప్రాంతాల్లో టోల్ రుసుము పెరిగిన నేపథ్యంలో, మొరట్టాండి టోల్‌గేట్‌లో మాత్రం రుసుము తగ్గించారు. జాతీయ రహదారుల కమిషన్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో 67 టోల్‌గేట్లున్నాయి. జూన్‌లో రాష్ట్రంలోని 36 టోల్ గేట్లలో 5 శాతం వరకు రుసుము పెరిగింది. ఆదివారం మిగిలిన 25 టోల్‌గేట్లలో రుసుము పెంచుతూ ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో, విల్లుపురం జిల్లా మొరట్టాండి టోల్‌గేట్‌లో మాత్రం రూ.5 తగ్గించారు. కార్లకు ఇప్పటివరకు రూ.85 వసూలుచేస్తుండగా ప్రస్తుతం రూ.80కి తగ్గించారు. భారీ వాహనాలకు రూ.255గా ఉన్న రుసుము రూ.250కి తగ్గింది. టోల్‌గేట్‌కు ఉన్న దూరాన్ని పరిగణలోకి తీసుకొని రుసుము తగ్గించినట్లు అధికారులు తెలిపారు.






మట్టితో బొమ్మల తయారీ





వివిధ రూపాల్లో విక్రయానికి సిద్ధంగా ఉన్న విగ్రహాలు




చవితి పూజకు వేళాయే...

• వివిధ రూపాల్లో సిద్ధమవుతున్న గణపతి విగ్రహాలు



వివిధ ఆకారాల్లో బొజ్జ గణపయ్య ప్రతిమలు

ప్యారీస్, సెప్టెంబరు 4: వినాయక చవితిని పురస్కరించుకొని వివిధ ఆకారాల్లో భక్తులను ఆకట్టుకొనేలా లంబోదరుడి విగ్రహాలు తయారవుతున్నాయి. మద్రాసు హైకోర్టు, తమిళనాడు పర్యావరణ శాఖ సూచనల మేరకు ఈ సారి కూడా పర్యావరణాన్ని పరిరక్షించాలన్న సంకల్పంతో పీఓపీ, రసాయనాల మిశ్రమం లేని వినాయకుడి విగ్రహాలను పది అడుగుల ఎత్తు మించకుండా కళాకారులు తయారుచేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం వినాయక ప్రతిమలకు అవసరమైన బంకమట్టి ఉచితంగా తవ్వుకొనేందుకు అనుమతించడంతో కళాకారులు వివిధ ఆకారాల్లో వినాయకుడి విగ్రహాలు మట్టితో చూడముచ్చటగా తీర్చిదిద్దుతున్నారు. నగరంలోని పులియాంతోపు, పటాలం, పురుషవాక్కం, సైదాపేట సమీపంలోని చిన్నమలై, పల్లావరం, అడయారు తదితర ప్రాంతాల్లో ఇప్పటికే చవితి పూజల కోసం వినాయకుడి విగ్రహాలు సిద్ధంగా ఉన్నాయి. ధరల గురించి ఆలోచించకుండా వినాయక పూజ చేసే కమిటీ నిర్వాహకులు తమకు నచ్చిన విగ్రహాలను కొనుగోలు చేసి, ఈ నెల 7వ తేది ఉదయం పోలీసులు అనుమతించిన ప్రాంతాల్లో పెట్టి పూజలు ప్రారంభిస్తారు. సింధూర గణపతి, మూషికా, సింహ వాహనంపై లంబోదరుడు ఇలా ప్రజలను ఆకర్షించే ప్రతిమల తయారీలో కళాకారులు బిజీ అయ్యారు.




గణపయ్య ప్రతిమకు రంగులు దిద్దుతున్న కళాకారుడు





'బ్లడీ బెగ్గర్'లో కవిన్

దీపావళి రేసులో కవిన్ 'బ్లడీ బెగ్గర్'

యువ హీరో కవిన్ నటిస్తున్న తాజా చిత్రం 'బ్లడీ బెగ్గర్'ను దీపావళికి విడుదల చేయాలని దర్శక నిర్మాతలు ప్లాన్ చేస్తున్నారు. దీపావళి పండుగకు రాజ్‌కుమార్ పెరియస్వామి దర్శకత్వంలో శివకార్తికేయన్ హీరోగా రూపొందిన 'అమరన్' చిత్రం విడుదలకానుంది. సాయిపల్లవి హీరోయిన్‌గా నటించిన ఈ మూవీలో శివకార్తికేయన్ ఆర్మీ అధికారిగా నటించారు. ఈ సినిమాను అక్టోబరు 31వ తేదీన విడుదల చేయనున్నట్టు ఇప్పటికే అధికారికంగా ప్రకటించారు. ఈ నేపథ్యంలో కవిన్ హీరోగా రూపొందుతున్న 'బ్లడీ బెగ్గర్' కూడా 31నే విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రముఖ దర్శకుడు నెల్సన్ దిలీప్ కుమార్ నిర్మాతగా డెబ్యూ డైరెక్టర్ శివబాలన్ ముత్తుకుమార్ దర్శకత్వం వహించారు. కథ బలంగా ఉండటంతో ప్రేక్షకులు ఆదరిస్తారన్న నమ్మకంతో చిత్రాన్ని విడుదల చేయాలని దర్శక నిర్మాతలు గట్టి నమ్మకంతో ఉన్నారు.

సీనియర్ నిర్మాత మోహన్ మృతి



మోహన్ (ఫైల్‌ఫొటో)

సీనియర్ సినీ నిర్మాత మోహన్ నటరాజన్ (71) కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో పాటు వృద్ధాప్యం కారణంగా బుధవారం వేకువజామున మృతి చెందినట్టు ఆయన కుమారుడు శరవణన్ వెల్లడించారు. సాలిగ్రామంలోని ఆయన స్వగృహంలో భౌతికకాయాన్ని సినీ ప్రముఖుల సందర్శనార్థం ఉంచి, బుధవారం సాయంత్రం అంత్యక్రియలను పూర్తి చేశారు. కాగా, మోహన్ తన సొంత నిర్మాణ సంస్థ శ్రీ రాజకాళి అమ్మన్ మూవీస్ పతాకంపై అనేక విజయవంతమైన చిత్రాలను నిర్మించారు. నిర్మాతగానే కాకుండా 'మహానది' మూవీలో విలన్‌గా కూడా నటించారు. ఆయన మృతిపట్ల పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు. సీనియర్ దర్శకుడు పి.వాసు, హీరో సూర్య పార్థివదేహానికి నివాళులర్పించారు. మోహన్ నిర్మాతగా 'పూక్కలై పరిక్కాదీర్‌గల్', 'పూ మజై పొళియుదు', 'ఇనియ ఉరవు పూత్తదు', 'ఎన్ తంగచ్చి పడిచ్చవ', 'ఎంగ అన్నన్ వరట్టుమ్', 'వేలై కిడైచ్చిరుచ్చు', 'కిళక్కుక్కరై', 'చాముండి', 'పదవి ప్రమాణం', 'కన్నుక్కుల్ నిలవు', 'వేల్', 'దైవ తిరుమగన్' తదితర చిత్రాలను నిర్మించారు.

స్విస్‌లో రాయ్‌లక్ష్మీ విహారం



'ధర్మపురి', 'ఇరుంబుకోట్టై', 'మురట్టు సింగం' వంటి పలు హిట్ చిత్రాల్లో నటించిన రాయ్ లక్ష్మీ అలియాస్ లక్ష్మీరాయ్ ఇపుడు విహార యాత్ర కోసం స్విట్జర్లాండ్‌కు వెళ్లారు. తమిళం, తెలుగు, కన్నడ, మలయాళ భాషాల చిత్రాల్లో నటిస్తున్న ఆమె 'జూలి' అనే చిత్రంలో తన అందాలను ఆరబోశారు. ఈ నేపథ్యంలో ఆమె ఉన్నట్టుండి అస్వస్థతకు లోనయ్యారు. ఒకానొక దశలో వీల్ చైర్‌కే పరిమితమై చికిత్స తీసుకున్నారు. చికిత్స నుంచి కోలుకున్న తర్వాత ఆమె మళ్లీ సినిమాల్లో నటిస్తున్నారు. ఈ క్రమంలో స్విస్ విహార యాత్రకు వెళ్ళిన ఆమె.. అక్కడ లగ్జరీ కార్లలో విహరిస్తూ స్పెషల్ ఫొటో షూట్ నిర్వహిస్తున్నారు. ఈ ఫొటోలను తన సోషల్ మీడియాలో షేర్ చేశారు.

లైంగిక వేధింపులపై ఫిర్యాదు చేస్తే తక్షణ చర్యలు

• సినీ నటుడు శరత్ కుమార్



చిత్రజ్యోతి

అడయార్, సెప్టెంబరు 4: ఎవరైనా లైంగిక వేధింపుల విషయంపై తనకు ఫిర్యాదు చేసే తక్షణ చర్యలు తీసుకుంటానని సీనియర్ నటుడు శరత్ కుమార్ తెలిపారు. బీజేపీ సీనియర్ నేత, ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ్ శ్రీనివాసన్ 61వ జన్మదిన వేడుకల్లో శరత్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జస్టిస్ హేమ కమిషన్ నివేదికపై స్పందించాలంటే, ఆ కమిటీ తయారు చేసిన 160 పేజీల నివేదికను క్షుణ్ణంగా చదివిన తర్వాత కామెంట్స్ చేస్తానని తెలిపారు. అదేసమయంలో లైంగిక వేధింపులు ఎదుర్కొన్న ఎవరైనా తన దృష్టికి తీసుకొచ్చినా, ఫిర్యాదు చేసినా తక్షణం చర్యలు తీసుకుంటానని, అలాగే, న్యాయపరమైన చర్యలు తీసుకునేలా దృష్టిసారిస్తానని తెలిపారు.



అర్జున్‌దాస్ హీరోగా 'బాంబ్'

అనేక చిత్రాల్లో విలన్‌గా అదరగొట్టిన నటుడు అర్జున్ దాస్ ఇపుడు హీరోగా బిజీ అవుతున్నారు. ఇప్పటికే ఆయన నటించిన 'అనీతి', 'రసవాది' వంటి చిత్రాలను ప్రేక్షకులు ఆదరించారు. దీంతో ఆయన ఇపుడు పూర్తిస్థాయి హీరోగా మారి, వరుస చిత్రాల్లో నటిస్తున్నారు. తాజాగా ఆయన హీరోగా తెరకెక్కుతున్న చిత్రానికి 'బాంబ్' అనే టైటిల్ ఖరారు చేశారు. కాళి వెంకట్, శివాత్మిక రాజశేఖర్, నాజర్, అభిరామి, సింగం పులి, బాల శరవణన్ తదితరులు ముఖ్య పాత్రలను పోషిస్తున్నారు. డి.ఇమ్మాన్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని సుధా సుకుమార్, సుకుమార్ బాలకృష్ణన్ సంయుక్తంగా నిర్మిస్తున్న ఈ చిత్రం ఫస్ట్‌లుక్ పోస్టర్ తాజాగా రిలీజ్ చేశారు. ప్రస్తుతం ఈ సినిమా నిర్మాణ పనులు శరవేగంగా జరుపుకుంటుంది.

ఘనంగా అంబికా హోటల్ రజతోత్సవం



రజతోత్సవంలో హోటల్ అధినేతలు, నిర్వాహకులు

చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక వడపళని హండ్రెడ్ ఫీట్ రోడ్డులో వున్న అంబికా ఎంపైర్ రజతోత్సవం ఘనంగా జరిగింది. ఈ వేడుకల్లో అంబికా గ్రూఫ్ ఆఫ్ కంపెనీస్ ఛైర్మన్ అంబికా కృష్ణ, మేనేజింగ్ డైరెక్టర్ అంబికా ప్రసాద్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ అంబికా సుదర్శన్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.అంబికా రామచంద్రన్, జనరల్ మేనేజర్ కళధినాథన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అంబికా కృష్ణ మాట్లాడుతూ.. అంబికా ఎంపైర్ హోటల్ మా ప్రాణం పోసుకున్న కల అని, ఈ 25 ఏళ్ల ప్రయాణంలో ఎన్నో అవాంతరాలను, సవాళ్లను అధిగమించి వినియోగదారులకు అనువైన సేవలందించామన్నారు. మరిన్ని విజయాలను సొంతం చేసుకునేందుకు కృషి చేస్తామన్నారు.

కాసాగ్రాండ్ బ్రాండ్ అంబాసిడర్‌గా సౌరవ్



చెన్నై, సెప్టెంబరు 4 (ఆంధ్రజ్యోతి): నిర్మాణ రంగంలో ప్రసిద్ధి చెందిన కాసాగ్రాండ్ సంస్థ బ్రాండ్ అంబాసిడర్‌గా లెజెండ్ క్రికెటర్ సౌరవ్ గంగూలీని నియమించుకుంది. ఈ మేరకు నిర్వాహకులు ప్రకటన విడుదల చేశారు. 'ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్' పేరుతో రెసిడెన్షియల్ రియల్ ఎస్టేట్ స్పేస్‌లో కాసాగ్రాండ్ మిషన్‌తో కలిసి దేశవ్యాప్తంగా గృహ కొనుగోలుదారుల్లో ఆసక్తి కలిగేలా ప్రచారం చేయడమే లక్ష్యంగా ఆయన్ని నియమించుకున్నట్లు పేర్కొంది.

నెలాఖరులో మద్రాసు వర్సిటీ స్నాతకోత్సవం



ప్యారీస్, సెప్టెంబరు 4: ఈ నెలాఖరులో మద్రాసు వర్సిటీ 166వ స్నాతకోత్సవం నిర్వహించనున్నట్లు రిజిస్ట్రార్ ఏలుమలై ప్రకటించారు. మద్రాసు వర్సిటీ, అన్నా వర్సిటీ, తమిళనాడు టీచర్స్ ఎడ్యుకేషన్ వర్సిటీ, కోవై భారతియార్ వర్సిటీ, మదురై కామరాజ్ వర్సిటీల్లో ఖాళీగా వైస్ ఛాన్సలర్ల పదవులను ఇప్పటివరకు భర్తీచేయలేదు. అందువల్ల రాష్ట్రప్రభుత్వం నియమించిన సమన్వయ కమిటీలు ఈ యూనివర్సిటీల నిర్వహణ బాధ్యతలు చేపట్టాయి. వీసీలు లేకపోవడంతో మద్రాసు వర్సిటీలో స్నాతకోత్సవం నిర్వహించలేదు. ఈ నేపథ్యంలో, గత నెల 22వ తేది రాజ్ భవన్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో... అక్టోబరు 31వ తేదిలోగా10 యూనివర్సిటీల స్నాతకోత్సవం నిర్వహణకు ప్రణాళిక రూపొందించినట్లు తెలిపింది. ఇదిలా ఉండగా, మద్రాసు వర్సిటీ రిజిస్ట్రార్ వి.ఏలుమలై, ఈ నెలాఖరులో 166వ స్నాతకోత్సవ వేడుకలు నిర్వహిస్తామని, ఇందులో పీహెచ్‌డీ పట్టభద్రులు స్వయంగా వచ్చి డిగ్రీలు పొందేందుకు వీలుగా దరఖాస్తు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. వర్సిటీ సమాచార కేంద్రంలో రూ.25 ఫీజు చెల్లించి దరఖాస్తు పూర్తిచేసి ఈ నెల 14వ తేదిలోగా అందజేయాలని తెలిపారు.

కరాటే విజేతలకు బహుమతుల పంపిణీ

వేలూరు, సెప్టెంబరు 4: జిల్లా జపాన్ సిట్యోరియా కరాటే పాఠశాల, కేఎల్వీ ఛాంపియన్ క్లబ్ సంయుక్తంగా దక్షిణ భారత స్థాయి కరాటే పోటీలు నిర్వహించాయి. జాతీయ కరాటే కోచ్ రమేష్ అధ్యక్షతన ఈ పోటీలు జరిగాయి. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సినీనటుడు పొన్నాంబలం పోటీల్లో గెలుపొందిన విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కరాటే కోచ్‌లు లచ్చి, విఘ్నేష్ సహా పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు అందజేస్తున్న సినీ నటుడు పొన్నాంబలమ్



స్టెమ్ సెల్ థెరపి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్


స్టెమ్ సెల్ పరిశోధనపై ప్రత్యేక దృష్టి

• ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్

ప్యారీస్, సెప్టెంబరు 4: స్టెమ్ సెల్ పరిశోధనలపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని డీఎంకే ఎంపీ తమిళచ్చి తంగపాండ్యన్ పేర్కొన్నారు. వడపళనిలో 'వరల్డ్ సెక్సువల్ డే' సందర్భంగా ఏర్పాటుచేసిన అవగాహన ఫొటో ప్రదర్శనను బుధవారం ఎంపీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.... ప్రమాదకర వ్యాధుల నుంచి దూరం చేస్తున్న స్టెమ్ సెల్ (మూల కణాలు) థెరపి కేంద్రాలను రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రపంచ బ్యాంక్ నిధులతో ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం పరిశీలిస్తోందని తెలిపారు. ఈ ప్రదర్శన 8వ తేది వరకు వడపళని డా.కామరాజ్ ఆస్పత్రి ప్రాంగణంలో ఉదయం 8 నుంచి రాత్రి 7 గంటల వరకు ఉచితంగా సందర్శించవచ్చని నిర్వాహకులు డా.టి.కామరాజ్, డా.జయరాణి తెలిపారు.

ఎస్‌పీఆర్ ఇండియా ఆధ్వర్యంలో తొలిసారి 'బిజినెస్ మీట్'

అడయార్, సెప్టెంబరు 4: పారిశ్రామిక రంగంలో అగ్రగామి కంపెనీల్లో ఒకటైన ఎస్‌పీఆర్ ఇండియా తొలిసారిగా ఇండస్ట్రీస్ ఇన్నోవేషన్స్‌పై 'బిజినెస్ మీట్ 2024'ను నగరంలో నిర్వహించింది. నుంగంబాక్కంలోని నక్షత్ర హోటల్‌లో జరిగిన ఈ సదస్సును సాంప్రదాయంగా పిలిచే 'చానెల్ పార్ట్‌నర్ మీట్'ను 'బిజినెస్ మీట్' పేరిట నిర్వహించారు. ఇందులో చెన్నై, బెంగళూరు, హైదరాబాద్, కోయంబత్తూరు తదితర నగరాలకు చెందిన 400 మంది చానెల్ పార్టనర్స్ పాలుపంచుకున్నారు. ఇందులో తమ భవిష్యత్ ప్రాజెక్టుల స్పెసిఫికేషన్లను ప్రదర్శించడంతో ఈ బిజినెస్ మీట్ ఒక మైలురాయిగా నిలిచిపోయింది. ఈ సందర్భంగా ఎస్‌పీఆర్ ఇండియా సీసీవో పంకజ్ ఓరూ మాట్లాడుతూ న్యూ ఇండస్ట్రీ బేస్డ్ ఇన్నోవేషన్స్ వెల్లడించడం హైలెట్‌గా నిలిచింది. ఈ సదస్సులో ప్రముఖ ఆర్కిటెక్ట్ సంజయ్ జోషి లైవ్ ప్రెజెంటేషన్ ఇవ్వగా, బనానా బ్రాండ్‌వర్క్స్ వ్యవస్థాపకుడు ముఫాదల్ అలీ కీలక ప్రసంగం చేశారు. ఈ ఈవెంట్ ద్వారా చానెల్ భాగస్వాముల అత్యుత్తమ ప్రతిభ పురస్కారాలను అందించడంతో పాటు అత్యుత్తమ చానెల్ పార్టనర్స్‌కు జ్ఞాపికలు ప్రదానం చేశారు.



ఎస్‌పీఆర్ డైరెక్టర్ నవీన్ నుంచి అవార్డు అందుకుంటున్న అజయ్ జైన్